సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 24 । జూన్ । 2025



జవాబుదారీగా..
కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 151 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఫిర్యాదులు స్వీకరించారు.
- 8లో ▸



కాంగ్రెస్ ప్రభుత్వంలోనే..
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.2 /24.4
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను నెరవేర్చాలి'



కామారెడ్డి టౌన్ : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కార్యకర్తలు నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన దేశ సమైక్యత కోసం ప్రాణాలను అర్పించిన మహానేత అని కొనియాడారు. 370 ఆర్టికల్ రద్దు కోసం ఉద్యమించిన ఆనాడే ఉద్యమించారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 370 ఆర్టికల్ రద్దు చేసి ఆయన ఆశయాన్ని నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణతార, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు కుంట లక్ష్మారెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

28న ట్రయాథ్లాన్ జిల్లా స్థాయి ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 28న ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి ట్రయాథ్లాన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–10, 12, 14 బాలబాలికల విభాగాల్లో 60 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హైజంప్, బ్యాక్ త్రో, 600 మీటర్ల కిడ్స్ జావెలిన్ త్రో, స్టాండింగ్ బోర్డ్ జంప్ అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు.

'కొత్త పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలి'



కామారెడ్డి అర్బన్ : కొత్త పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంత్‌రెడ్డి, విజయరామరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం పెన్షనర్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ వినతిని ప్రధానమంత్రికి పంపాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు లచ్చయ్య, ప్రతినిధులు గంగారాం, రవీందర్, రాజలింగయ్య, సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలి



కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయలలో విలేకరులతో మాట్లాడారు. ప్రొటోకాల్ పేరిట ఎమ్మెల్యే అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. వెంకటరమణారెడ్డి సొంత మెనిఫెస్టోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, గోనె శ్రీనివాస్, సందీప్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌వోగా నరహరి



నరహరి

కామారెడ్డి క్రైం : కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వోగా రెండేళ్లుగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మల్టీ జోన్–1 పరిధిలో ఏడుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మల్టీ జోన్–1 కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న నరహరి రానున్నారు.

ఎల్లారెడ్డి బస్ డిపో కోసం సేకరించిన స్థలం



బస్ డిపో ఏర్పాటయ్యేనా!?

- పాతికేళ్లుగా ఎన్నికల హామీగానే మిగిలిన అంశం
- నెరవేరని ఎల్లారెడ్డి ప్రజల ఆకాంక్ష
- నేడు రవాణాశాఖ మంత్రి పొన్నం రాక
- డిపో ప్రకటించాలని కోరుతున్న నియోజకవర్గవాసులు

ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు అంశం ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. డిపో ఏర్పాటు అన్నది కాంపౌండ్ వాల్‌కే పరిమితమైంది. రెండున్నర దశాబ్దాలు దాటినా అడుగులు ముందుకు పడకపోవడంతో నియోజకవర్గ ప్రజలు నిరాశ చెందుతున్నారు. మంగళవారం ఎల్లారెడ్డి బస్టాండ్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్న నేపథ్యంలో డిపో అంశం మరోసారి చర్చలోకి వచ్చింది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో ఎల్లారెడ్డి పట్టణం మధ్యలో ఉంటుంది. ఎల్లారెడ్డి మీదుగా జాతీయ రహదారి పనులు పురోగతిలో ఉన్నాయి. జాతీయ రహదారి పనులు పూర్తయితే ఎల్లారెడ్డి పట్టణం మరింతగా విస్తరించే అవకాశాలున్నాయి. డివిజన్ కేంద్రమైన ఎల్లారెడ్డి పట్టణానికి నాగిరెడ్డిపేట, నిజాంసాగర్, లింగంపేట, గాంధారి తదితర మండలాల నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చుట్టుపక్కల మండలాల ప్రజలు జుక్కల్ ప్రాంతంతోపాటు సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు వెళ్లాలంటే ఎల్లారెడ్డిని దాటాల్సిందే.. ఈ ప్రాంతంలో బాన్సువాడ, మెదక్, హైదరాబాద్‌ల మధ్య నడిచే ఆర్టీసీ బస్సులన్నీ ఎల్లారెడ్డి గుండానే తిరుగుతాయి. ఎల్లారెడ్డికి చుట్టుపక్కల వందలాది గ్రామాలున్నాయి. ఎల్లారెడ్డి బస్టాండ్ ఎప్పుడూ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది.

డిపో లేక.. బస్సులు తిరగక...

ఎల్లారెడ్డిలో బస్ డిపో లేకపోవడంతో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండాపోయింది. కొన్ని రూట్లలో కామారెడ్డి డిపో బస్సులు, మరికొన్ని రూట్లలో బాన్సువాడ డిపో బస్సులు నడుస్తున్నాయి. అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో ఇప్పటికీ బస్సు నడవని గ్రామాలు ఎన్నో ఉండడం గమనార్హం. ఇతర డిపోల అధికారులు ఎల్లారెడ్డి గ్రామాలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా బస్ డిపో ఉంటే చుట్టుపక్కల గ్రామాలకు వివిధ మార్గాల ద్వారా బస్సులు నడిపే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పర్యటనతో మళ్లీ ఆశలు..

ఎల్లారెడ్డి పట్టణంలో బస్ డిపో ఏర్పాటు కోసం రెండున్నర దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేశారు. ఏడు ఎకరాల స్థలం సేకరించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రతి ఎన్నిక సందర్భంలోనూ ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటు అంశం తెరమీదికి వస్తుంటుంది. నాయకులు హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత మర్చిపోవడం షరామామూలుగా మారిపోయింది. చాలామందికి బస్సు డిపో ఏర్పాటవుతుందన్న ఆశ కూడా పోయింది. ఎన్నో ఏళ్లుగా బస్ డిపో పేరుతో ఓట్లు దండుకున్నారు తప్ప డిపో ఏర్పాటు చేయడం లేదని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా బస్ డిపోలు రావడం లేదంటూ తప్పించుకున్నారని, పొరుగు జిల్లాల్లో బస్ డిపోలు ఏర్పాటవుతున్న విషయాన్ని గుర్తుచేస్తే ఏవేవో కారణాలు చెబుతారని పేర్కొంటున్నారు. బస్ డిపో ఏర్పాటు కోసం ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. ఎల్లారెడ్డిలో బస్టాండ్ ప్రారంభోత్సవానికి మంగళవారం రవాణా శాఖ మంత్రి వస్తుండడంతో మళ్లీ ప్రజల్లో ఆశలు చిగురించాయి. బస్ డిపో ఏర్పాటు చేసి ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని కోరుతున్నారు.

డిపో స్థలం వేదికగానే హామీలు..

బస్ డిపో ఏర్పాటు కాకపోవడంతో దానికోసం సేకరించిన ఏడెకరాల స్థలం ఖాళీగా ఉంటోంది. దీంతో ఆ స్థలాన్ని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ పార్టీల సభలకు, అధికారిక సభలకు ఉపయోగించుకుంటున్నారు. ఆ స్థలం వేదికగానే ఎందరో నాయకులు ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు. ఆ హామీలు ఏళ్ల గడుస్తున్నా అమలు కాకపోవడం గమనార్హం.

నేడు ఎల్లారెడ్డి బస్టాండ్ ప్రారంభోత్సవం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో రూ. 4.25 కోట్ల మున్సిపల్ నిధులతో నిర్మించిన నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి హైదరాబాద్ నుంచి మెదక్ వరకు హెలికాప్టర్‌లో వచ్చి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన ఎల్లారెడ్డికి చేరుకుంటారని పేర్కొన్నారు.

బస్‌డిపో ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డిలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. డిపో ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రభుత్వం స్పందించి డిపో ఏర్పాటు చేయాలి.
– చింతకుంట బాలయ్య, ఎల్లారెడ్డి

ఇబ్బందులు తీరుతాయి



నియోజకవర్గంలో చాలా గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. బాన్సువాడ, కామారెడ్డి, బోధన్, మెదక్ డిపోల బస్సులే ఆధారం. ఆ బస్సులు వచ్చేంతవరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఎల్లారెడ్డిలో డిపో ఉంటే రవాణా ఇబ్బందులు తీరుతాయి.
– ఒడ్డె నర్సింలు, ఎల్లారెడ్డి

మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

- ఉమ్మడి జిల్లాలోని కాలేజీల బాధ్యతలు డీపీహెచ్‌కు..
- కమిటీలో కలెక్టర్లకు చోటు



కామారెడ్డి టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలు, అనుబంధ బోధనాస్పత్రుల అభివృద్ధి, అత్యుత్తమ సేవలు అందేలా చూసేందుకు మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన ఈ కమిటీ ఆయా కళాశాలల్లో తనిఖీలు చేపట్టనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

కమిటీలో ఎవరున్నారంటే..

నిజామాబాద్, కామారెడ్డి మెడికల్ కాలేజ్ మానిటరింగ్ కమిటీ ఇన్‌చార్జిగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(డీపీహెచ్) రవీందర్ నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. తనిఖీ కమిటీలో నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు వినయ్‌కృష్ణారెడ్డి, ఆశిష్ సంగ్వాన్‌లకు చోటు కల్పించారు. వీరు ఆయా జిల్లాల పరిధిలో బాధ్యులుగా ఉంటారు. కమిటీ సభ్యులుగా నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిజామాబాద్ ఈఈ కుమార్‌లను నియమించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 25 నుంచి 29 మధ్య కమిటీ ప్రతినిధులు ఆయా కళాశాలల్లో తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఇబ్బందులు, లోపాలు, సమస్యలపై నివేదికలను సిద్ధం చేసి ఈనెల 30న ప్రభుత్వానికి నివేదించాలని ప్రభుత్వం ఆదేశించింది. తనిఖీలలో భాగంగా కళాశాలకు కావాల్సిన యాక్షన్ ప్లాన్‌ను కూడా రూపొందించనున్నారు. రాష్ట్రంలోని పలు మెడికల్ కాలేజీల నిర్వహణ తీరుపై ఎన్‌ఎంసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ మానిటరింగ్ కమిటీల పర్యవేక్షణలో కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయనున్నట్లు తెలుస్తోంది.

ఆరు అంశాలపై తనిఖీలు..

ప్రధానంగా ఆరు అంశాలపై ఈ కమిటీ దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించింది. మొదటి అంశంలో మౌలిక సదుపాయాలు, భవనాలు, లెక్చరర్ హాళ్లు, ల్యాబ్‌లు, హాస్టళ్లు, పడకల సంఖ్య, వైద్య పరికరాలు, నీటి సరఫరా, శానిటేషన్ ఉన్నాయి. రెండో అంశంలో అధ్యాపకులు, సిబ్బంది పోస్టులు, ఖాళీలు, మూడో అంశంలో ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు బోధన ప్రణాళిక అమలు, నాలుగో అంశంలో విద్యార్థుల సంక్షేమం, మెడికోలకు వసతి, సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, ర్యాగింగ్ నిరోధ చర్యలు, విద్యార్థుల ఫిర్యాదులున్నాయి. ఐదో అంశంలో ఆర్థికపరమైన అంశాలు, అవసరమైన నిధులు, ఆరో అంశంలో డిజిటల్ వ్యవస్థలో భాగంగా హాజరు అమలు, సీసీ టీవీలు, ఇంటర్నెట్ సౌకర్యం వంటివి ఉన్నాయి. ఆయా అంశాలపై కమిటీ తనిఖీలు చేసి నివేదికలను ప్రభుత్వానికి అందించనుంది.

29న రైతు సమ్మేళనం

- హాజరుకానున్న కేంద్రమంత్రి అమిత్ షా



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈనెల 29వ తేదీన నిర్వహించే రైతు సమ్మేళనానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగం వల్లే కశ్మీర్ దేశంలో అంతర్భాగమైందని, ఆయన త్యాగాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు మర్చిపోలేరని పేర్కొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నాలుగు దశాబ్దాల పసుపు రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు అమిత్ షా నిజామాబాద్‌కు వస్తున్నారన్నారు. పసుపు, ఇతర పంటల రైతుల భవిష్యత్ తీర్చిదిద్దే కార్యాచరణ ప్రణాళిక ప్రకటించే అవకాశముందని తెలిపారు. అదేరోజు మాజీమంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా తన వ్యక్తిగత విజ్ఞప్తి మేరకు కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరిస్తారన్నారు. పసుపు బోర్డు కేంద్ర కార్యాలయానికి శాశ్వత భవనం కోసం జెడ్పీ వెనక ప్రాంతంలో రెండెకరాల స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించామని, ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన, ఉద్యమాలకు ఊపిరి లూదిన నిజామాబాద్ జిల్లాకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కోరింది తానేనన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్, నాయకులు మోహన్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనస్ జమ చేయాలి



వినతిపత్రాన్ని చూపుతున్న బీకేఎస్ నాయకులు

కామారెడ్డి అర్బన్: సన్న వడ్లకు సంబంధించిన బోనస్‌ను వెంటనే జమ చేయాలని, రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) డిమాండ్ చేసింది. సోమవారం బీకేఎస్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, కార్యదర్శి ఆర్ల శంకర్‌రావు, విత్తన ప్రముఖ్ బోరెడ్డి బైరెడ్డి, రెవెన్యూ ప్రముఖ్ సాహెబ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి'



రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి అర్బన్ : చిన్ననాటి నుంచే క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్ తెలంగాణ క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం సోమవారం జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేడియంలో మొక్కను నాటారు. విద్యార్థులకు వివిధ క్రీడలు నిర్వహించి 10 మంది చొప్పున బాలబాలికలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో వచ్చేనెల 2న నిర్వహించే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపేవారు ఆయా క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందనున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి జగన్నాథన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కామారెడ్డి క్రైం: రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఎస్‌బీఐ 71 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డిలోని ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 100 మందికిపైగా ఎస్‌బీఐ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఓ నిండు ప్రాణాన్ని కాపాడినవారం అవుతామన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

జిల్లాలో హాట్ టాపిక్‌గా 'ఫోన్ ట్యాపింగ్'

- పలువురికి సిట్ అధికారుల నుంచి ఫోన్లు
- కాంగ్రెస్ లీగల్ సెల్ నేత దేవరాజ్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిలకు పిలుపు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్రంలో రాజకీయ దుమారం లేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కామారెడ్డిలోనూ హాట్‌టాపిక్‌గా మారింది. స్థానికంగా పలువురు నేతలకు ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసు అధికారులు ఫోన్లు చేసి ట్యాపింగ్ జరిగిన విషయంలో వాంగ్మూలం ఇవ్వడానికి రావాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. దీంతో కామారెడ్డి హాట్‌సీట్‌గా మారిపోయింది. ఆ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఇద్దరు కీలక నేతలను కాదని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డిని గెలిపించారు. అయితే ఎన్నికల సమయంలో కామారెడ్డి కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ పెద్ద ఎత్తున జరిగిందన్న ప్రచారం జరిగింది. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు కామారెడ్డికి చెందిన పలువురికి ఫోన్‌లు చేసి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సమాచారం కోసం పిలుస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకుడు దేవరాజ్‌గౌడ్‌కు సిట్ అధికారుల నుంచి ఫోన్ రాగా ఆయన మూడు నాలుగు రోజుల్లో వస్తానని వారికి సమాచారం ఇచ్చారు. అలాగే ఇటీవలే పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గడ్డం చంద్రశేఖర్‌రెడ్డికి కూడా సిట్ అధికారుల నుంచి ఫోన్ వచ్చింది. ఆయనతో పాటు మరో ఎనిమిది మందికి కూడా అధికారులు ఫోన్ చేసి హైదరాబాద్‌కు రావాలని సూచించారు. ఎవరెవరి ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయన్న అంశంపై వివరాలు సేకరించిన పోలీసులు వారిని వాంగ్మూలంకోసం పిలుస్తున్నట్లు సమాచారం. బుధవారం ఉదయం 11 గంటలకు సిట్ వద్ద సాక్షిగా తన వాంగ్మూలం ఇవ్వనున్నట్లు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి 'సాక్షి'తో తెలిపారు.

బాధితులు ఎందరో..

జిల్లాలో ఫోన్ ట్యాపింగుకు గురైనవారు ఎందరున్నారో అన్న చర్చ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాలన్నీ కామారెడ్డి నియోజకవర్గం చుట్టే తిరిగాయి. అప్పటి సీఎం కేసీఆర్‌ను ఓడిస్తానంటూ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేసి వచ్చి బరిలో నిలిచారు. ఇద్దరు ఉద్దండులను వెంకటరమణారెడ్డి ఓడించడం అప్పట్లో సంచలనం కలిగించింది. కాగా కామారెడ్డిలో ఎందరి ఫోన్లు ట్యాపింగ్‌కు గురయ్యాయన్న దానిపై చర్చ నడుస్తోంది. సిట్ అధికారుల వద్ద ఉన్న జాబితాలో ఉన్న వారికి ఫోన్లు వస్తుండడంతో ఇంకా ఎవరెవరున్నారోనని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

'పేద విద్యార్థులకు వరంలా గురుకులాలు'



బీర్కూర్‌లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ : గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు గురుకుల పాఠశాలలు వరంలా మారాయని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ. 26 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులను అందించారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్యామల, ఆర్‌సీవో సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ లత, పాఠశాల ప్రిన్సిపల్ శివకుమార్, నాయకులు యామ రాములు, శశికాంత్, శ్రీనివాస్‌గౌడ్, బస్వరాజ్, రఘు, బోయిని శంకర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

బాన్సువాడ నియోజకవర్గంలోని పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాన్సువాడలో సోమవారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందించారు. 107 మందికి రూ. 35.41 లక్షల విలువ చేసే చెక్కులను అందించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నస్రుల్లాబాద్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. సోమవారం దుర్కి గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో అకస్మాత్తుగా మరణించిన స్వప్న మరణానికి సంతాపం తెలిపారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలు వస్తే 108కు ఫోన్ చేయాలన్నారు. రాబోయే కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య సూపర్ వైజర్‌ను ఆదేశించారు. ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ల తనిఖీలు



సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్లు ప్రయివేటు వ్యక్తులకు ఇసుక అమ్మ కుండా నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా పోలీస్ అధికారులు సోమవారం బిచ్కుందలో తనిఖీలు చేపట్టారు. సోమవారం సాక్షి దినపత్రికలో 'ఇసుక మేమే సరఫరా చేస్తాం..' అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్సై మోహన్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లకు వెళ్తున్నాయా లేదా అని ట్రాక్టర్లను ఆపి వేబిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఆ గ్రామ ట్రాక్టర్ల యజమానులు ఇతర మండలాల ట్రాక్టర్లను క్వారీలోకి రాకుండా అడ్డుకుంటున్న విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. పోలీసుల సహకారంతో ఇతర మండలాల ట్రాక్టర్లకు ఇసుక కోసం వే బిల్లులు ఇస్తామని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానీపేట వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలకు ఇసుక అవసరం ఉన్నవారు అధికారుల అనుమతితో పాటు ట్రాక్టర్లకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

సర్కారు బడిలో సాంకేతిక పాఠాలు

- 50 మంది విద్యార్థులు ఎక్కువున్న స్కూళ్లకు 5 కంప్యూటర్లు
- ఈ విద్యా సంవత్సరం నుంచే ఏఐ విద్య
- పైలట్ ప్రాజెక్టుగా 5 పాఠశాలల్లో ప్రారంభం
- జిల్లాలో 214 పాఠశాలల విద్యార్థులకు మేలు



కంప్యూటర్ విద్యను నేర్పిస్తున్న బోధకులు (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ప్రాథమిక పాఠశాలలో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) పాఠాలు వేగవంతం చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 5 పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ జరుగుతోంది. ఇంకో వైపు ప్రభుత్వం 50 మందికి పైగా విద్యార్థులున్న ప్రతి ప్రాథమిక పాఠశాలలకు 5 కంపూటర్లు మంజూరు చేయాలని నిర్ణయింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. కామారెడ్డి జిల్లాలో దాదాపు 800పైగా ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో 214 పాఠశాలల్లో 50 మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ఏఐ బోధనతో కంప్యూటర్‌పై అవగాహన..

ఏఐ వినియోగంతో ప్రాథమిక దశలోనే విద్యార్థులకు కంప్యూటర్లపై అవగాహన కలుగనుంది. కంప్యూటర్ విద్యపై భయం తొలగనుంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా చేపట్టిన సాంకేతిక బోధనతో విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలు నేర్చుకుంటున్నారు. తొలిసారిగా ఏడు పాఠశాలల్లో కంప్యూటర్లతో పాఠాలు నేర్చుకునే అవకాశం దక్కింది. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు కంప్యూటర్‌లో పదాలు, వాక్యాలు, కూడికలు, తీసివేతల సామర్థ్యాలను అంచనా వేసి కేటగిరీలుగా విభజించారు. ఒక్కో విద్యార్థికి రోజుకు 20 నిమిషాలు చొప్పున వారంలో నాలుగు రోజులు ఏఐ పాఠాలు నేర్చుకునే అవకాశమిస్తున్నారు. అంతే కాకుండా ఏఐ విద్యను రెండు రకాలుగా బోధించనున్నారు. జిల్లాలో 27 పాఠశాలలో ఏఐ ద్వారా తెలుగు, గణితం బోధించడం ఓ పద్ధతి అయితే గణితంను ఛాప్టర్-5 గా సిలబస్‌లో భాగంగా నేర్పించడం రెండో పద్ధతిగా బోధకులు చెబుతున్నారు.

ఐదు పాఠశాలల ఎంపిక..

జిల్లాలో ఏఐ కంప్యూటర్ విద్యకోసం పైలట్ ప్రాజెక్టు కింద ఐదు పాఠశాలలను ఎంపిక చేశారు. శెట్‌పల్లి, కోమలంచ, బోర్లం, రామారెడ్డి, బావాపూర్ ఎంపీపీఎస్‌లను ఎంపిక చేసి ఏప్రిల్ 21 నుంచి విద్యనందిస్తున్నారు.

ఏప్రిల్ 21 నుంచి ప్రారంభించాం



విద్యార్థులకు ఏఐ ద్వారా విద్యను నేర్పించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. ఈ కార్యక్రమాన్ని పైలెట్‌గా 5 పాఠశాలలో ఏప్రిల్ 21 నుంచి ప్రారంభించాం. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి పాఠశాలలో ప్రారంభించడానికి పనులు సాగుతున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాం. మరి కొన్ని రోజుల్లో కంప్యూటర్ విద్య ప్రారంభమవుతుంది.

– వేణుగోపాల్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, కామారెడ్డి

పాఠాలు సులువుగా నేర్చుకోవచ్చు



ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఏఐ ద్వారా పాఠాలు బోధించడం ద్వారా గణితం, ఆంగ్లం, కోడింగ్, డీకోడింగ్‌లను విద్యార్థులు సులభంగా నేర్చుకోవచ్చు. దీని వల్ల క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలలకు వస్తారు. అంతే కాకుండా చిన్నతనంలోనే కంప్యూటర్‌పై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో కంప్యూటర్ విద్య అలవాటుగా మారుతుంది.

– అయ్యాల సంతోష్, ఉపాధ్యాయుడు, బోర్లం

జవాబుదారీగా విధులు నిర్వర్తించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: అధికారులు జవాబుదారీగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 151 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విచారణ జరిపి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సమస్యల పరిష్కారం విషయంలో తీసుకున్న చర్యల సమాచారాన్ని దరఖాస్తుదారునికి తెలియపరచాలని సూచించారు. అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలి

యూనిఫైడ్ పెన్షన్ పథకం పేరిట కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న నూతన పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన చట్టానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా పెన్షనర్ల సంతకాలను సేకరించి కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రికి పంపుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాత పెన్షన్ దారులకు హాని చేసే మరో బిల్లును 2025-26 ఆర్థిక బిల్లులో భాగంగా లోక్‌సభలో ఆమోదించారని తెలిపారు. ఈ బిల్లులతో పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. నూతన విధానంలో పెన్షన్ పొందుతున్న పాత పెన్షనర్లకు ఇకపై డీఏ తప్ప పెన్షన్ పెరుగుదల ఉండదన్నారు. వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, ఇతర అవసరాలకు ఆర్థిక ఇబ్బందులు తప్పవన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి



లింగంపేట పానాది రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం ఆయన బాయంపల్లి, అన్నారెడ్డిపల్లి, లింగంపేట గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి మాట్లాడారు. బాయంపల్లిలో రూ. 20 లక్షల నిధులతో జీపీ భవనం నిర్మించినట్లు తెలిపారు. అలాగే లింగంపేట పానాది రోడ్డు స్థానిక పెద్దమ్మ ఆలయం ముందు నుంచి పోస్టాఫీసు వరకు రూ. కోటితో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అన్నారెడ్డిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయించినట్లు తెలిపారు. లింగంపేట మండల రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతుండడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా లింగంపేట మండలాన్ని ఎంపిక చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి రఫియోద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, కాశీరాం, ఎల్లమయ్య, అట్టెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో బీటీ రోడ్లకు..

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని మౌలాన్‌ఖేడ్, వెంకటాపూర్ అగ్రహారం, వెల్లుట్లతాండా, వెల్లుట్ల వెంకటాపూర్, సోమర్యాగడితాండా గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శంకుస్థాపన చేశారు. మల్లయ్యపల్లి, శివాపూర్, అల్మాజీపూర్‌లలో నిర్మించిన నూతన జీపీ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్మ సాయిబాబా, సొసైటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, తదితరులున్నారు.

ఒక్కొక్కటిగా హామీలన్నీ నెరవేరుస్తా



రత్నగిరిపల్లిలో ముదిరాజ్ సంఘం కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్

- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

మాచారెడ్డి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రత్నగిరిపల్లి, గజ్‌పూర్, కాకులగుట్ట తండా, లచ్చాపేట గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తన సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు మూడేళ్లలో కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మాచారెడ్డి మండల అధ్యక్షుడు బూస సురేష్, జిల్లా సీనియర్ నాయకులు పొన్నాల వెంకటరెడ్డి, మండల ఇన్‌చార్జి పండ్ల ప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు భరత్ యాదవ్, ఓదేలు, రమేష్, కిషన్ గౌడ్ తదితరులున్నారు.

మొక్కజొన్న పంటపై అడవిపందుల దాడి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో మొక్కజొన్న పంటపై ఆదివారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. రమావత్ బాబునాయక్‌కు చెందిన రెండెకరాలలో మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. అడవిపందుల దాడి వల్ల పంటనష్టం జరిగిందని, అధికారులు ఆదుకోవాలని బాబునాయక్ కోరారు.

మహిళా అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించటానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శోభారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. 26న డెమో, ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

కుల బహిష్కరణకు గురైన వ్యక్తి నిరాహార దీక్ష



బాన్సువాడ: బాన్సువాడ పట్టణానికి చెందిన జర్నలిస్టు మేకల సాయిలు తనను కుల బహిష్కరణ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సోమవారం ఎస్సీ వార్డులో గల శ్రీనివాస కల్యాణ మండపం వద్ద నిరాహార దీక్ష ప్రారంభించారు. గ్రామానికి చెందిన పానాదిని ఒక వ్యక్తి కబ్జా చేసి అమ్మడానికి ప్రయత్నించగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో కుల సంఘం సభ్యులతో కలిసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చర్యలు తీసుకునేంత వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తానన్నారు.

డబుల్ ఇళ్ల బిల్లుల కోసం పోలీసులకు ఫిర్యాదు



నిజాంసాగర్(జుక్కల్): డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ బిల్లులు ఇప్పించాలని మహమ్మద్ నగర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సోమవారం ఎస్సై శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. గిర్ని తండా, దూప్‌సింగ్ తండా, తెల్గాపూర్ గ్రామాల్లోని డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించడం లేదని వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు కావడంతో ఇళ్లు నిర్మించామని తెలిపారు. రెండు విడతల్లో బిల్లులు ఇచ్చారని, మూడో విడత బిల్లులు రావాల్సి ఉందని, కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తు న్నాడని ఆరోపించారు. బిల్లుల కోసం కాంట్రాక్టర్‌కు ఫోన్ చేస్తే ఎత్తడం లేదని, ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసినా తమకు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొన్న మోపెడ్.. ఒకరి మృతి



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామశివారులో సోమవారం ఉదయం మోపెడ్ వాహనం చెట్టును ఢీకొని మహమ్మద్ గని(36) అనే వ్యక్తి మృతి చెందాడు. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన గని పాన్‌షాపు డబ్బా నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెట్రోల్ కోసం మోపెడ్‌పై వెళ్తున్న గని సుల్తాన్‌నగర్ శివారులో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్నాడు. తలపగిలి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సైనాజ్, తల్లి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



నిజాంసాగర్(జుక్కల్): చోరీ కేసులో ఒకరి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈ నెల 8 మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న మన్నె అంజవ్వ ఇంట్లో అత్రం ప్రశాంత్ అనే వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ద్విచక్రవాహన చోరీలో..

నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామంలో గత నెల 28న నిర్వహించిన కుస్తీ పోటీల ప్రాంతం నుంచి ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన కేసులో నిందితుడు రవిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన పాట్లోళ్ల సాయిరాం మాగి గ్రామంలో కుస్తీ పోటీలు తిలకించేందుకు పల్సర్ బైక్‌పై వచ్చాడు. వాహనాన్ని పార్కింగ్ చేసి, కుస్తీపోటీలను తిలకించాడు. అనంతరం వెళ్లి చూడగా బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పల్సర్ బైక్‌పై వెళ్తున్న రవిని పట్టుకొని విచారించామని ఎస్సై తెలిపారు. బైక్‌ను తానే దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



రామారెడ్డి: మండలంలోని పోసానిపేట గ్రామంలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాజారాం తెలిపిన వివరాల ప్రకారం .. పోసానిపేట గ్రామానికి చెందిన బచ్చు బలరాం ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి రాగా, సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు మూడు తులాల బంగారం, 15 తులాల వెండిని అపహరించినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

బస్టాండ్ ప్రహరీని ఢీకొట్టిన బస్సు

- ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందే ఘటన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి ఒకరోజు ముందే అనుకోని ఘటన ఏర్పడింది. మెదక్ డిపోకు చెందిన డీలక్స్ బస్సు సోమవారం బస్టాండ్‌లో రివర్స్ తీసుకుంటున్న సమయంలో వెనక వైపు ఉన్న ప్రహరీని తాకడంతో కూలిపోయింది. సమీపంలో ఉన్న విద్యుత్ స్థంభానికి బస్సు తగిలి ఉంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు ఆందోళన చెందారు. కాగా, మంగళవారం మంత్రి చేతుల మీదుగా బస్టాండ్ ప్రారంభోత్సవం ఉండడంతో సిబ్బంది కూలిన ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు.

డబ్బుల కోసం తల్లి హత్య

పోలీసుల అదుపులో కొడుకు



చంద్రకళ (ఫైల్)

బోధన్‌రూరల్: డబ్బులు, నగల కోసం కన్నతల్లిని కొడుకు గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటన బోధన్ మండలంలో కలకలం రేపింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం పెంటాకుర్దు గ్రామానికి చెందిన అంబం చంద్రకళకు మహారాష్ట్రకు చెందిన గైక్వాడ్ వెంకటితో 40 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు కొడుకులు భూషణ్, సురేశ్, కూతురు జ్యోతి పుట్టిన తర్వాత చంద్రకళ భర్తకు దూరమై సుమారు 20 ఏళ్ల నుంచి పెంటాకుర్దులోనే ఒంటరిగా జీవిస్తోంది. పిల్లలందరికీ పెళ్లిళ్లు కాగా అప్పుడప్పుడు వారు తల్లి వద్దకు వెచ్చివెళ్తుంటారు. చిన్న కుమారుడు సురేశ్ నిత్యం తల్లి దగ్గరకు వచ్చి డబ్బులు తీసుకోవడం, డబ్బులు ఇవ్వకపోతే గొడవ పడుతుండేవాడు. నాలుగు రోజుల క్రితం తల్లి వద్దకు వచ్చిన సురేశ్ పెంటాకుర్దులోనే ఉంటూ ఆదివారం డబ్బుల కోసం గొడవకు పడ్డాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో చంద్రకళ (59)ను కిరాతకంగా గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె కాలికి ఉన్న సుమారు 50 తులాల వెండి కడియాన్ని ఎత్తుకెళ్లాడు. సోమవారం చంద్రకళ రక్తపుమడుగులో ఉండటాన్ని చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, నిందితుడు సురేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి



రైలు పట్టాలపై లక్ష్మీబాయి

ఆర్మూర్‌టౌన్/నందిపేట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో గల రైల్వేట్రాక్‌పై మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట్ మండల కేంద్రానికి చెందిన లక్ష్మీబాయి(50) ఆదివారం పెర్కిట్‌లోని తన కూతురు ఇంటికి వచ్చింది. కూరగాయల వ్యాపారం చేస్తుండేది. కూతురి ఇంటి నుంచి రాత్రి బయల్దేరిన లక్ష్మీబాయిని గుర్తు తెలియని రైలు ఢీకొంది. ఉదయం గూడ్స్ రైలు వస్తుండగా ట్రాక్‌పై తీవ్రగాయాలతో ఉన్న ఆమె చేతు ఊపడంతో లోకో పైలెట్ గమనించి రైలును నిలిపారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిందన్నారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు..



ఖలీల్‌వాడి: నగరంలోని శాంతినగర్‌కు చెందిన అబ్దుల్ వాజీద్ (29) గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే మేనేజర్ సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి



బైండ్ల తేజశ్విని (ఫైల్)



తేజశ్విని మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

బోధన్: నవీపేట మండల కేంద్ర శివారులోని బాసర-నిజామాబాద్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలంలోని బినోలా గ్రామానికి చెందిన బైండ్ల గంగాధర్ కొన్నేళ్లుగా మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాప్ నిర్వహిస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నారు. గంగాధర్‌కు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు బైండ్ల తేజశ్విని (16) ఇటీవల పదో తరగతి పూర్తి చేయగా, ఇంటర్ కోసం నిజామాబాద్ నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. కళాశాల హాస్టల్‌కు వెళ్లేందుకు సోమవారం సాయంత్రం గంగాధర్ కూతురు తేజశ్వినితో కలిసి బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరారు. మండల కేంద్ర శివారులో బాసర వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ.. బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడిపోగా తీవ్రగాయాలైన తేజశ్విని అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే కూతురు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గంగాధర్ ఫిర్యాదు మేరకు నవీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల సంతకాలు ఫోర్జరీ

- కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి క్రైం: విధులకు గైర్హాజరు కావడమే కాకుండా ఉన్నతాధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన వ్యవహారంలో ఓ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. కే రవి కుమార్ అనే కానిస్టేబుల్ ఇటీవలే బదిలీపై దేవునిపల్లి పీఎస్‌కు వచ్చాడు. ఇది వరకు పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఏఎస్సై సంతకాలు ఫోర్జరీ చేసి బస్సు వారంట్లను దుర్వినియోగం చేశాడు. విధులకు గైర్హాజరు కావడం, బదులుగా ఎస్సై సంతకాన్ని ఫోర్జరీ చేసి పై అధికారులకు నివేదికలు పంపించాడు. పలు విషయాల్లో రవికుమార్‌పై ఆరోపణలు రావడంతో బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి విచారణ జరిపి ఎస్పీ రాజేశ్‌చంద్రకు నివేదిక సమర్పించారు. దీంతో రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా సూర్యం



నిజామాబాద్ సిటీ: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర తొలి మహాసభ విజయవంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్ భవన్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కే సూర్యం, కార్యదర్శిగా ఎస్‌ఎల్ పద్మ, ఉపాధ్యక్షులుగా ఎం నరేందర్, ఎం హన్మేష్, జీ రామయ్య, కే రాజన్న, సీ వెంకటేష్, సహాయ కార్యదర్శిగా ఎం వెంకన్న, ముత్తన్న, వీ ప్రవీణ్, అరుణ్ కుమార్, యాకుబ్ షావలి, కోశాధికారిగా కిరణ్, సభ్యులుగా 26 మందిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం 15 తీర్మానాలను ఆమోదించారు. తెలంగాణలోని కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని, పీఎఫ్, పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం నరేందర్, సహాయ కార్యదర్శులు ఎం ముత్తెన్న, ఎం వెంకన్న, జిల్లా కార్యదర్శి ఎం సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేశ్వర్, మల్లేశ్, జిల్లా నాయకులు కిరణ్, రవి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.